నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 10 డిసెంబర్ 2024 | YADADRI BHUVANAGIRI

ఎమ్మెల్సీ కోటిరెడ్డి అరెస్టు

అసెంబ్లీ సమావేశాలు సోమవారం ప్రారంభం కాగా, హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లిన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డిని అదుపులోకి తీసుకుని వ్యాన్‌లో తరలిస్తున్న దృశ్యమిది.

ధాన్యం కొనుగోళ్లు అంతంతే..!

జిల్లాలో వడ్ల సేకరణ 2.03లక్షల మెట్రిక్ టన్నులే..

- ప్రభుత్వ లక్ష్యంలో సగం మాత్రమే కొనుగోలు
- గతేడాది వాన కాలం కంటే 50వేల మెట్రిక్ టన్నులు తక్కువే..
- సన్నాలు 3,812 మెట్రిక్ టన్నులతోనే సరి..
- సర్కారు, మిల్లర్ల కొర్రీలతోనే ప్రైవేట్‌కు రైతులు
- రూ. 92 కోట్ల ఎంఎస్‌పీ అమౌంట్ పెండింగ్

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం లక్ష్యం చేరలేదు. నిర్దేశించుకున్న టార్గెట్‌లో సగం వద్దే ఉండిపోయింది. గతేడాది వానకాలం సీజన్‌లో సేకరించిన దాని కంటే సుమారు రూ. 50వేలు తక్కువగా ధాన్యాన్ని కొనుగోలు చేసింది. మరోవైపు సన్నాలకు బోనస్ పేరుతో సర్కారు హడావుడి చేసినా.. ఇప్పటి వరకు కేవలం 3812 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లతోనే సరిపెట్టుకుంది. సర్కారు, మిల్లర్ల కొర్రీలతోనే రైతులు ప్రైవేట్‌లో అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది.

– యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ)

భువనగిరి మార్కెట్ యార్డులో ధాన్యం కాంటా వేస్తున్న హమాలీలు

పోయినసారి కంటే 50వేల మెట్రిక్ టన్నులు తక్కువ..

ప్రభుత్వం నిర్దేశించుకున్న ధాన్యం సేకరణ లక్ష్యంలో సగం మాత్రమే కొనుగోలు చేసింది. జిల్లాలో సోమవారం వరకు 99 కేంద్రాలను మూసేశారు. ఇప్పటి వరకు 23,530 మంది రైతుల వద్ద నుంచి 2.03లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను మాత్రమే కొన్నారు. ఇందులో 19.98 మెట్రిక్ టన్నుల ఏ గ్రేడ్ ఉంది. గతేడాది ఇదే సీజన్‌లో జిల్లాలో 30,192 మంది రైతుల నుంచి 2,53,434 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. అంటే ప్రస్తుతం సుమారు 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తక్కువగా సేకరించారు. జిల్లాలో ఇంకా అక్కడక్కడ కొద్ది మేర ధాన్యం మాత్రమే ఉంది. ఇక ఇప్పటి వరకు 22,528 మంది రైతుల ఖాతాల్లో రూ. 447 కోట్ల ఎంఎస్‌పీ డబ్బులు జమ చేయగా, ఇంకా రూ. 92 కోట్లు పెండింగ్‌లో ఉంది.

జిల్లాలో వానకాలంలో 2.76లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ సీజన్‌లో 6,16,507 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో 5,45,148 మెట్రిక్ టన్నుల దొడ్డు వడ్లు వచ్చే అవకాశం ఉందని భావించారు. ప్రభుత్వం మాత్రం 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించింది. జిల్లాలో 3,87,888 మెట్రిక్ టన్నుల దొడ్డు వడ్లు కొనాలని అనుకుంది. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 372 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది.

సన్నాలు 3,812 మెట్రిక్ టన్నులే..

రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు బోనస్ ఇస్తామని గొప్పలు చెప్పుకొంటున్నది. కానీ ప్రభుత్వ లెక్కల్లో సన్నాల కొనుగోళ్లు ఆమడ దూరంలో ఉన్నాయి. జిల్లాలో 70,364 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. వివిధ అవసరాలకు పోగా.. 32,364 టన్నుల సన్న వడ్లు కొనాలని భావించారు. ఇందుకోసం ప్రత్యేకంగా 47 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ కొనుగోలు కేంద్రాల్లో సన్నాలు అమ్ముడానికి రైతులు ఆసక్తి చూపించలేదు. జిల్లాలో ఇప్పటి వరకు 3,812 ఎంటీల సన్నాలు మాత్రమే కొన్నారు. సర్కారు కొర్రీలు, ప్రైవేట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో అంతా బయటే అమ్ముకున్నారు.

అంశం	2023	2024 (చివరి దశ లో ఉంది..)
కేంద్రాలు	293	372
అమ్మిన రైతులు	30,192	23,530
సేకరణ	2,53,434 మెట్రిక్ టన్నులు	2,03,621 మెట్రిక్ టన్నులు
నగదు జమ	రూ. 542 కోట్లు	రూ. 447 కోట్లు

కారణాలు ఇవీ..

వడ్ల సేకరణలో వెనుకబడటానికి అనేక కారణాలను విశ్లేషిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం, సకాలంలో కాంటాలు వేయకపోవడం, కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్ల కొర్రీల కారణంగా చాలా మంది రైతులు వడ్లను ప్రైవేట్‌లో విక్రయించారు. తాలు, తేమ అంటూ ఏవో సాకులు పెట్టి ఇబ్బంది గురి చేస్తున్నారు. దీంతో ధాన్యం దిగుబడి వచ్చిన ప్రారంభంలోనే బయటకు విక్రయించారు. అంతే కాకుండా సీఎంఆర్ భర్తీ చేయాలని ప్రభుత్వం నుంచి ఒత్తిడి, కేసులు నమోదవుతాయనే భయంతో మిల్లర్లు కూడా ధాన్యం కొన్నారు. దీంతో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మడానికి రైతులు ముందుకు రాలేదు.

కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు

గొర్రెల పంపిణీ పథకంలో నగదు బదిలీ ప్రారంభించాలి

- గతంలో కట్టిన డీడీ డబ్బులు తిరిగి ఇవ్వడం సరికాదు
- కలెక్టరేట్ ఎదుట గొర్రెలు, మేకల పెంపందార్ల సంఘం నాయకుల నిరసన

భువనగిరి కలెక్టరేట్, డిసెంబర్ 9 : రెండో విడుత గొర్రెల పంపిణీని వెంటనే ప్రారంభించి నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపందార్ల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దెపురం రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం 2017లో ప్రారంభించిన గొర్రెల పంపిణీ పథకంలో రెండో విడుతగా జిల్లాలో 13,000 యూనిట్లు రావాల్సి ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో నగదు బదిలీ ద్వారా ప్రతి ఒక్కరికీ రెండు లక్షల రూపాయల చొప్పున జమ చేస్తామని హామీ ఇచ్చి, ఏడాదైనా అమలు చేయలేదని తెలిపారు. గొల్ల కురుమలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని విమర్శించారు. జిల్లాలో 342 మంది రూ.43,750 చొప్పున మూడేండ్ల కిందట డీడీలు తీసి కలెక్టర్ ఖాతాలో జమ చేయగా, ప్రస్తుత ప్రభుత్వం వారికి డబ్బులు తిరిగి ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో వాటా కోసం గొల్ల కురుమలు ఐక్యంగా ఉద్యమాలు చేయాలని కోరారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం అదనపు కలెక్టర్ గంగాధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ, సహాయ కార్యదర్శులు కొండె శ్రీశైలం, జోగు శ్రీనివాస్, సంఘం సీనియర్ నాయకులు చేగూరి నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు పాక జహంగీర్, తుమ్మేటి బాలకృష్ణ, మన్నెబోయిన రాజలింగం, నారి వెంకటేశం, కడెం బీరప్ప, మల్లేశ్ పాల్గొన్నారు.

గుర్రంపోడులో తాసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న రైతులు

రైతులను నట్టేట ముంచిన సర్కారు

- రుణమాఫీ చేయకుండా కాలయాపన
- గుర్రంపోడులో రైతుల రాస్తారోకో

గుర్రంపోడ్, డిసెంబర్ 9 : రైతు రుణమాఫీ అందరికీ చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని, వెంటనే రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. గుర్రంపోడు మండల కేంద్రంలో సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార మహ్మద్ ఫరీదుద్దీన్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా నాయకులు జక్కలి నర్సింహ్మ, వనమాల కామేశ్వర్ మాట్లాడుతూ అనేక హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను, రైతులను నట్టేట ముంచిందన్నారు. ఇంకా గ్రామాల్లో సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, రైతు భరోసా ఇవ్వలేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాలుగో విడుతలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని చెప్పడం సిగ్గుచేటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ముడ్సు లాలయ్య, మల్లయ్య, మోపూరి ఆచారి, మారయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురంలో సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు

ఎక్కడికక్కడ మాజీ సర్పంచుల అరెస్ట్

- చలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లకు తరలించి నిర్బంధం

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ) : పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరుతూ చలో హైదరాబాద్‌కు వెళ్తున్న మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్టు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో తరలివెళ్లకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. తెల్లవారుజాము నుంచే పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి నిఘా పెట్టారు. నల్లగొండ, మిర్యాలగూడ, కనగల్, చండూరు, మాడ్గులపల్లి, నాంపల్లి, పెద్దవూర, త్రిపురారం, నిడమనూర్, దేవరకొండ, హాలియా, నకిరేకల్, కట్టంగూరు, మునుగోడు తదితర మండలాల్లో మాజీ సర్పంచ్‌లను పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించారు. సూర్యాపేట జిల్లా చివ్వెంల, పెన్‌పహాడ్, నేరేడుచర్ల, గరిడేపల్లి, మోతె, చిలుకూరు, తిరుమలగిరి, తుంగతుర్తి, నాగారం, మద్దిరాల, నూతనకల్.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి, గుండాల, సంస్థాన్‌నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, రాజాపేట మండలాల్లో మాజీ సర్పంచులను అరెస్ట్ చేశారు. చలో హైదరాబాద్ వెళ్లేందుకు అనుమతి లేదంటూ పోలీసులు తేల్చిచెప్పారు. ప్రభుత్వ అనుమతి లేకుండా రాజధానిలో ఆందోళనలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

11న ఎస్సీ వర్గీకరణ కమిషన్ రాక

నల్లగొండ, డిసెంబర్ 9 : ఎస్సీ వర్గీకరణను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏక సభ్య కమిషన్ ఈ నెల 11న నల్లగొండకు రానున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణకు వివరణాత్మక అధ్యయనం కోసం కమిషన్ చైర్మన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కూడిన బృందం రానుందని పేర్కొన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన ఎస్సీ కుల సంఘాల నుంచి వినతులు స్వీకరించి బహిరంగ విచారణ చేయనున్నట్లు తెలిపారు. కలెక్టరేట్‌లో ఉదయం 11గంటలకు ఈ బహిరంగ విచారణ ఉండనున్నందున ఎస్సీ కులాల వారు తమ విన్నపాలతో రావాలని ఆమె సూచించారు.

మేమేం చేశామో చెబుతాం..

మీరేం చేస్తారో చెప్పండి

యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, చిత్రంలో డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తదితరులు

- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సాగు జలాలపై అవగాహన గుండు సున్నా
- సలహాలు కావాలంటే చెబుతాం.. స్వీకరించే దమ్ముందా?
- 2019లోనే ఆలేరుకు కాళేశ్వరం జలాలు వచ్చాయ్
- మిషన్ కాకతీయతో 579 చెరువులను ఆధునీకరించాం
- కొండగల్‌కు వైద్య కళాశాల తరలిస్తే అడ్డుకున్నది మేమే
- తాగునీటికోసం బిందెలు తీసుకొని ఒక్క మహిళా రోడ్డుపైకి రాలే
- కాంగ్రెస్ పాలనలో ఆలేరును ఆగం చేసే ప్రయత్నం
- తపాసుపల్లి నుంచి చుక్క నీళ్లు వస్తే రాజకీయ సన్యాసం
- ప్రెస్‌మీట్‌లో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత
- మేం చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేస్తాం : ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, డిసెంబర్9 : 'తొమ్మిదిన్నరేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఆలేరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని ఆధారాలతో చెబుతాం.. మరో నాలుగేండ్ల కాలంలో మీరే చేస్తారో చెప్పాలి. ఆలేరుకు వచ్చే సాగు జలాలపై స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు అవగాహన గుండు సున్నా. అభివృద్ధి చేయలేదని అబద్ధాలు మాట్లాడేటప్పుడు అసలు అభివృద్ధి అంటే ఏమిటో తెలుసుకొని మాట్లాడాలి' అని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. బీర్ల అయిలయ్య తమ సవాల్‌ను స్వీకరించి ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి ఏమిటో, రాబోయే రోజుల్లో చేసే పనులేమిటో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏడాది పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ ప్రజా విజయోత్సవాలు నిర్వహించుకుంటున్న సందర్భంగా బీఆర్ఎస్‌పై బీర్ల అయిలయ్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఆలేరు నియోజకవర్గ అభివృద్ధే తమ లక్ష్యమని తెలిపారు. సలహాలు, సూచనలు కావాలంటే చెప్పేందుకు సిద్ధమని, స్వీకరించేందుకు సిద్ధమేనా? అని ఎమ్మెల్యే బీర్లను ఆమె ప్రశ్నించారు. 2014లోనే నీళ్లు, నిధులు, నియామకాలు అనే ట్యాగ్‌లైన్‌తోనే బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తమ హయాంలో అభివృద్ధిలో ముందున్న ఆలేరును ఆగం చేస్తామంటే ఊరుకునేది లేదని చెప్పారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వ ద్వారా ఆలేరు నియోజకవర్గానికి సాగు జలాలు వస్తున్నాయని, కాళేశ్వరం పేరును కనుమరుగు చేస్తామంటే సహించబోమని హెచ్చరించారు. ఎస్ఆర్ఎస్పీ నుంచి ఆలేరుకు సాగుజలాలు రావన్న సంగతి ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అవగాహన లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బ్యారేజీ నుంచి కరువుగా మారిన ఎస్ఆర్ఎస్పీని కేసీఆర్ గోదావరి జలాలతో నింపారని తెలిపారు. ఒక్క కాల్వ తొవ్వని ఎమ్మెల్యే బీర్ల సాగు జలాలు అందించామని చెప్పడం అవగాహన రాహిత్యమేనని అన్నారు. దేవాదుల ఎత్తిపోతల పథకం కింద నిర్మించిన నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి ప్రధాన కుడి కాల్వ ద్వారా 2019లోనే గుండాల మండలానికి సాగుజలాలు తీసుకొచ్చి 17,680 ఎకరాలకు సాగుజలాలు అందించామని చెప్పారు. కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా తుర్కపల్లి, బొమ్మలారామారం మండలాల్లో 1,285 ఎకరాలు, 14 చెరువులు.. మన్నెవారి తుర్కపల్లి ప్రధాన కాల్వ ద్వారా రెండు మండలాల్లో 868 ఎకరాలు, 20 చెరువుల్లోకి గోదావరి జలాలు అందజేశామన్నారు. కాళేశ్వరం 16వ ప్యాకేజీలో భాగంగా నృసింహ సాగర్ జలాశయం నుంచి యాదగిరిగుట్ట గండి చెరువులోకి గోదావరి జలాలు వచ్చిన సంగతి ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. ఆలేరుకు మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలు వస్తాయని ఎస్ఆర్ఎస్పీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. గంధమల్ల జలాశయం 9.86 టీఎంసీలతో నిర్మించాలని కేసీఆర్ భావించినా పవర్ గ్రిడ్ సమస్యతో దానిని 4.29 టీఎంసీలకు మార్చామని తెలిపారు. గంధమల్ల గ్రామం ముంపునకు గురవుతుందని, దానిని 1.41 టీఎంసీలకు కుదించి రూ. 574 కోట్ల నిధుల సైతం కేసీఆర్ మంజూరు చేశారని చెప్పారు. ఆలేరును ఎంతో గొప్పగా అభివృద్ధి చేసి ఇచ్చామని, వండి పెడితే వడ్డించడం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు చేతకావడం లేదన్నారు.

వైద్య కళాశాలను కొడంగల్‌కు తరలిస్తుంటే అడ్డుకున్నది మేమే..

యాదాద్రి పేరిట యాదగిరిగుట్టకు వైద్య కళాశాల ఏర్పాటుకు గత సీఎం కేసీఆర్ 2023 సెప్టెంబర్ 16న మంజూరు చేశారని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. జీఓ 162 ప్రకారం రూ. 183 కోట్ల పరిపాలన అనుమతులు వచ్చాయని, దీంతోపాటు 433 పోస్టులు, 100 ఎంబీబీఎస్ సీట్ల సామర్థ్యం, 300 పడకల ఆసుపత్రి సైతం మంజూరైందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వైద్య కళాశాలను కొండగల్‌ను తరలించే ప్రయత్నం చేసిందని అన్నారు. వైద్య కళాశాలను 220 పడకలకు, 50 ఎంబీబీఎస్ సీట్లకు కుదించారని తెలిపారు. దీనిపై అప్పట్లో తాము ధర్నాకు దిగామని, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వద్దకు వెళ్లి వినతి పత్రం కూడా అందజేశామని చెప్పారు. వైద్య కళాశాల తరలి వెళ్తే జనాల్లో ఇబ్బందని బీర్ల అయిలయ్య మంత్రి కోమటిరెడ్డి వద్దకు వెళ్లి బతిమిలాడుకున్న సంగతి నిజం కాదా? ప్రశ్నించారు. యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి అమృత్ పథకం కింద రూ. 38 కోట్లు, ఆలేరు మున్సిపాలిటీకి రూ. 18 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గుట్ట మున్సిపాలిటీ పనులు చేపట్టి ఆలేరులో ఎందుకు పనులను నిలిపివేశారో చెప్పాలన్నారు. మున్సిపల్ చైర్మన్ శంకరయ్య ఉంటే పనులు చేయనని చెప్పడం తగదన్నారు. మిషన్ కాకతీయ పథకం కింద ఆలేరు నియోజకవర్గంలో మూడు విడుతల్లో 579 చెరువులు, కుంటల ఆధునీకరణకు రూ. 280 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. దీంతోపాటు యాదగిరిగుట్ట మండలంలోని మల్లాపురం చెరువు, సైదాపురం చెరువు, యాదగిరిగుట్ట పట్టణంలో గండిచెరువును రూ. 6.77 కోట్లతో మినీ ట్యాంక్ బండ్‌లుగా ఆధునీకరించామన్నారు. శామీర్‌పేట, ఆలేరు, బిక్కేరు, బునాదిగాని కాల్వలపై 43 చెక్ డ్యామ్‌లను నిర్మించామని, మరో 14 చెక్‌డ్యామ్‌లను ఆధునీకరించామని తెలిపారు. ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగు జలాలను 2016 నుంచే అందిస్తున్నామన్నారు. 8 మండలాలు, 2 మున్సిపాలిటీలు కలిపి 324 అవాస గ్రామాలకుగానూ 74,306 ఇండ్లకు నల్లా కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న 277 ట్యాంకులను ఆధునీకరించి అదనంగా మరో 216 ట్యాంకులను కొత్తగా నిర్మించామని, ఇందుకోసం రూ. 7,992.11 లక్షలు ఖర్చు చేశామని చెప్పారు. తాగునీటి కోసం బిందెలు తీసుకొని ఒక్క మహిళ కూడా రోడ్డుపైకి రాలేదని గుర్తు చేశారు. 2014లో తాను ఎమ్మెల్యే అయ్యాక బునాదిగాని కాల్వ భూసేకరణకు కేసీఆర్‌ను ఒప్పించి నిర్వాసితులందరికీ నష్టపరిహారం అందజేశామని తెలిపారు.

తపాసుపల్లి నుంచి చుక్క నీళ్లు వస్తే ఎమ్మెల్యే పోటీ నుంచి తప్పకుంటా

తుపాసుపల్లి నుంచి చుక్క నీళ్లు ఆలేరుకు తీసుకువస్తే ఎమ్మెల్యే పోటీ నుంచి తప్పకుంటానని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత అన్నారు. సాల్వాపూర్ గ్రామంలో నిర్మించిన తపాసుపల్లి జలాశయం నుంచి 24 మీటర్ల ఎత్తుకు జలాలు ఎత్తిపోయాలని, అది సాధ్యం కాదని మాజీ మంత్రి హరీశ్ వేసిన ఇంజినీరింగ్ కమిటీ స్పష్టం చేసిందని తెలిపారు. కాళేశ్వరం 15 ప్యాకేజీ వద్ద ఓటీ ఇచ్చి డిస్ట్రిబ్యూటరీ కాల్వ ద్వారా 18 కిలోమీటర్ల వరకు కాల్వను తొవ్వి రాజాపేట మండలంలోని 8 గ్రామాలకు నీళ్లందించే పనులు చేపట్టామని, ఇందుకోసం రూ. 12.40 కోట్ల నిధులను ఖర్చు చేశామని తెలిపారు. పదేళ్ల కాలంలో ఆలేరులో వాగులు, చెరువుల్లో నీళ్లు కనిపించలేదా? అని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను ప్రశ్నించారు. చేయాల్సింది చాలా ఉందని, అందుకు తాము సహకరిస్తామని, తట్ట పట్టుకుని పనులు చేయాలంటే చేస్తామని, విమర్శలు, తప్పుడు ఆరోపణలు మాని అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆమె హితవు పలికారు.

కమీషన్ల కోసం పనులు ఆపేస్తున్న ఎమ్మెల్యే

- ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

తొమ్మిదిన్నరేండ్ల కాలంలో తాము చేసిన అభివృద్ధిపై శ్వేత పత్రంపై విడుదల చేస్తామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆలేరులో అభివృద్ధి జరుగలేదని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చేసిన విమర్శలను ఆయన కొట్టి పారేశారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు ఆలేరు అభివృద్ధి, ఇరిగేషన్, ప్రొసీడింగ్ అంటే ఏమిటో తెలియదని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి శిష్యుడు బీర్ల అయిలయ్య బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్ష సాధింపు చేపట్టి అక్రమ కేసులను పెడుతున్నారని ఆరోపించారు. ఏడాదిలో రూ. 300 కోట్లతో అభివృద్ధి చేశామని చెబుతున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆధారాలతో రుజువు చేయాలన్నారు. తొమ్మిదిన్నరేళ్ల కాలంలో ఆర్‌అండ్‌బీ, ఈజీఎస్, ఎస్‌డీఎఫ్, పంచాయతీ నిధులు రూ.479 కోట్లతో నూతన బీటీ రోడ్లతో పాటు బీటీ రెన్యూవల్, అంతర్గత రోడ్లు, సీసీ రోడ్లు వేశామని తెలిపారు. రూ. 176.33 కోట్లతో ఆలేరు నియోజకవర్గ వ్యాప్తంగా కమ్యూనిటీ భవనాలు, అశురఖానలు, నూతన పంచాయతీ భవనాలు, పాఠశాల అదనపు గదులు, విద్యుత్ సబ్ స్టేషన్లు, స్త్రీ శక్తి భవనాలు, పశువైద్యశాలలుతోపాటు వివిధ పక్కా భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చామని చెప్పారు. ఆలేరు నుంచి గుండాల, ఆలేరు నుంచి కొలనుపాక, యాదగిరిగుట్ట నుంచి తుర్కపల్లికి ఫోర్‌లైన్ బీటీ రోడ్డు, యాదగిరిగుట్ట నుంచి రాజాపేటకు డబుల్ రోడ్డు, బేగంపేట, హాజీపూర్, మునిరాబాద్, సుద్దాల, పారుపల్లిలో హై లెవల్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టామన్నారు. బొమ్మలరామారం నుంచి కొండమడుగు, కొలనుపాక నుంచి నమిలే, ఆలేరు నుంచి రఘునాథపురం వరకు బీటీ డబుల్ రోడ్లను నిర్మించామని తెలిపారు. నీళ్లు, నిధులు, నియామకం అనే ట్యాగ్ లైన్ మాజీ సీఎం కేసీఆర్ ది అయితే, నిర్లక్ష్యం, నిరసనలు, నిర్బంధాలు అనే ట్యాగ్‌లైన్ సీఎం రేవంత్‌రెడ్డిదని ధ్వజమెత్తారు. అబద్ధాలతో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కాలంగడుపుతున్నారని విమర్శించారు. కమీషన్లు సెటిల్ అయ్యాకే పనులకు శంకుస్థాపన చేస్తున్నారని, కమీషన్ల కోసం బెదిరించి పనులను నిలిపివేస్తున్నారని తెలిపారు. ఆలేరు ప్రజలకు అంతా గమనిస్తున్నారని, కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, వివిధ మండలా పార్టీ అధ్యక్షులు బొట్ల యాదయ్య, గంగుల శ్రీనివాస్, పొలగాని వెంకటేశ్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, ఎండీ ఖలీల్, సట్టు తిరుమలేశ్, ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, మాజీ జడ్పీటీసీలు తోటకూరి అనూరాధ, పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు చీముల సుధీర్‌రెడ్డి, పైళ్ల ఇందిరాసత్యనారాయణరెడ్డి, గోపగాని బాలమణి, నాయకులు మిట్ట వెంకటయ్య, పాపట్ల నరహరి, పీఏసీఎస్ చైర్మన్లు నర్సింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గూడె బాల నర్సయ్య, నాయకులు చిత్తర్ల బాలయ్య, సయ్యద్ బాబా, గడ్డం చంద్రం, పేరబోయిన సత్యనారాయణ, ఆరె శ్రీధర్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.